

నేడు మాంసం విక్రయాలు చేయరాదు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: మహాత్మా గాంధీ జన్మదినం సందర్భంగా 2వ తేదీన (సోమవారం) నగరపాలక సంస్థ పరిధిలో ఎక్కడా మాంసం దుకాణాలు తెరవరాదని, విక్రయాలు జరపరాదని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. నిబంధనలు మీరి నడుచుకునే వారి దుకాణాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్సులు రద్దు చేయడంతో పాటు, సీజ్ చేస్తామని హెచ్చరించారు. నగర కమిషనర్ ఆదేశాల మేరకు ప్రజారోగ్య విభాగం అధికారులు నగరంలోని మాంసం విక్రయదారులు, హోటళ్ల యజమానులకు నోటీసులు జారీ చేశారు.

పనులు లేక పస్తులు

వర్షాకాలంలో భవన నిర్మాణ కార్మికుల వెతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
గత నెల 15 రోజులకు పైగా ఏదో ఒక సమయంలో రోజూ వర్షం కురుస్తూనే ఉంది. ఈ వర్షాలతో భవన నిర్మాణాలు ముందుకు సాగడం లేదు. ఎక్కడికక్కడ భవన నిర్మాణపనులు ఆగిపోయాయి. వర్షంలో నిర్మాణ పనులు చేస్తున్నా మధ్యలో వర్షంతో నిర్మాణ పని ఆగిపోయి సగం కూలీ తీసుకోవాల్సి వస్తోంది. కొన్ని సందర్భాల్లో వర్షం కారణంగా పూర్తిగా పనులు లేని రోజులున్నాయి. ఇలా భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని పనిచేస్తున్న భవన నిర్మాణ మేస్త్రీలు, కూలీలు పనులు దొరక్క పూటగడవడమే ఘగనంగా మారింది.

జిల్లా కేంద్రమైన చిత్తూరుకు భవన నిర్మాణపనుల కోసం బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల, జీడి నెల్లూరు, తవణంపల్లి, ఐరాల వంటి ప్రాంతాల నుండే కాకుండా ఇతర రాష్ట్రాల నుండీ కూలి పనులు చేసుకొనే కార్మికుల వేలసంఖ్యలో వస్తుంటారు. కార్మికశాఖ లెక్కల ప్రకారం ఒక్కరోజుకు చిత్తూరు పరిసర ప్రాంతాల్లో 4 వేల మందికి పైగా భవన నిర్మాణ రంగాన్ని నమ్ముకొని పనిచేసే కార్మికులున్నారు. వరస వర్షాలతో ఈ రంగాన్ని నమ్ముకొని బతుకుతున్న కూలీల పరిస్థితి దయనీయంగా మారింది. జిల్లా కేంద్రమైన చిత్తూరు మార్కెట్ చౌక్ భవననిర్మాణ కూలీలకు అడ్డా..... పట్టణంలో నిర్మాణాలు చేపడుతున్న వారికి మేస్త్రీలు కూలీలు కావాలంటే ఉదయాన్నే ఇక్కడి వస్తే



నిర్మాణ పనులు చేస్తున్న భవన నిర్మాణ కార్మికులు

గుంపులు, గుంపులుగా కూలీలు, మేస్త్రీలు పనుల కోసం వేచి ఉంటారు. అయితే వర్షం కారణంగా పనులు దొరక్క తిరిగీ సొంత గ్రామాలకు వెళ్ళేందుకు చార్జీల కోసం మేస్త్రీ బంధువులను అడుక్కోవాల్సిన పరిస్థితి.

పనులు లేక పస్తులు..

భవన నిర్మాణ రంగంలో పని చేస్తున్న కూలీలు పనులు లేక వారి కుటుంబాలు పస్తులుండాల్సిన పరిస్థితి. వరుసగా రోజూ ఏదో ఒక సమయంలో వర్షం కురుస్తుండటంతో భవననిర్మాణ పనులు జరగడం లేదు. ఏపూటకాపూట కూలి డబ్బులతో సరుకు తీసుకొనే కూలీలు కూలి పనులు లేక కుటుంబాన్ని కూడా పస్తులు పెట్టాలి వస్తుందని భవన నిర్మాణ కూలీలు వాపోతున్నారు. పని దొరికినా మధ్యలో వర్షం వస్తే సంగం కూలి మాత్రమే ఇస్తున్నారని, బస్సు ఛార్జీలు, భోజనం ఖర్చు పోను మిగిలేది ఏమీ లేదంటున్నారు. వరుసగా వర్షాలకు కురిసే సమయంలో ప్రభుత్వం భవన నిర్మాణ కూలీలను ఆదుకొనేలా చర్యలు తీసుకోవడంతో పాటు, నిర్మాణ పనులక ఉపయోగించే ఇసుక కొరత లేకుండా చూడాలని కోరుతున్నారు.

తీరనున్న ఏళ్లనాటి కల.. ఉడమలకుర్తి

హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణానికి శంకుస్థాపన

డిప్యూటీ సీఎం నారాయణస్వామి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం:
మండలం ఉడమలకుర్తి గ్రామంలో ఆదివారం ఉదయం రహదారులు, భవనముల శాఖ వారి ఆధ్వర్యంలో ఎండిఆర్ ప్లాన్ కింద రూ.27కోట్లతో మంజూరైన హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణంకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఎక్సైజ్ శాఖ మంత్రి నారాయణస్వామి, చిత్తూరు ఎంపీ రెడ్డప్ప, జిల్లా కలెక్టర్ షన్మోహన్, రాష్ట్ర ఏపిఎస్ ఆర్టిసి వైస్‌చైర్మన్ విజయానంద రెడ్డి భూమిపూజ చేశారు. అనంతరం స్థానిక సర్పంచ్ చిట్టి మహేష్, ఎంపిటిసి ఏసమ్మ, కాంట్రాక్టర్ దీపిక, కన్స్ట్రక్షన్ గురవారెడ్డి అండ్ బ్రదర్స్ చిత్తూరు– పుత్తూరు రోడ్డు నుంచి ఉడమలకుర్తి వయా పిళ్ళారి కుప్పం రోడ్డు నందు కి.మీ 8/2.6లో ఎత్తైన వంతెన శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ... ఈ వంతెనను రూ.27 కోట్లతో మంజూరు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. ఈ వంతెన మంజూరు కొరకు జిల్లా గత కలెక్టర్ ఎం.హరి నారాయణన్ ఇందుకు సంబంధించిన ఫైల్స్‌ను పరిశీలించి ప్రభుత్వంకు పంపారని గుర్తు చేశారు. ప్రస్తుతం ఈ వంతెనకు సంబంధించిన అటవీశాఖ అనుమతులు తీసుకుని ఆర్ అండ్ బి శాఖ ద్వారా మంజూరు చేశారని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ నియోజకవర్గ పరిధిలో అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారంకు ప్రత్యేక చొరవ చూపుతున్నారని తెలిపారు. ఈ నియోజకవర్గ అభివద్ధికి అవసరమైన అన్ని పనులు ముఖ్యమంత్రి మంజూరు చేస్తున్నారని, వెదురుకుప్పం మండలంలో రూ.19కోట్లతో డిగ్రీ కాలేజీ మంజూరు కావడం జరిగిందని తెలిపారు. చిత్తూరు ఎంపి రెడ్డప్ప మాట్లాడుతూ రూ.27 కోట్లతో చేపట్టే పనులకు నేడు భూమి పూజ చేశామని, ఎన్నో ఏళ్ళ కల సాకారం అవుతోందని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.షన్మోహన్ మాట్లాడుతూ ఈవంతెన మంజూరు కొరకు ఉపముఖ్యమంత్రి ఎంతో కషి



హై లెవెల్ బ్రిడ్జి శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం నారాయణస్వామి

చేశారు. ఈ నియోజకవర్గంలో మంజూరు అయిన అన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకొంటామని తెలిపారు. ఎపిఎస్ ఆర్టిసి వైస్ చైర్మన్ విజయానంద రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో చేపట్టిన ప్రతి పనిని పూర్తి చేసేందుకు ఉప ముఖ్యమంత్రి కషి చేస్తున్నారని, నియోజకవర్గ అభివద్ధికి తన శాయ శక్తుల కషి చేస్తున్నారని కొనియాడారు. ఆర్ అండ్‌బి ఏఎన్‌సి నయీముల్లా మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి కషితోనే ఈ వంతెన మంజూరైందని, వచ్చే సంవత్సరం లోపు ఈప్రాజెక్ట్‌ను పూర్తి చేసేందుకు కషి చేస్తామని, నాణ్యతతో పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్ అండ్ బి ఎస్ఈ ఉమామహేశ్వర రెడ్డి, ఈఈ స్టీవెన్ జోన్స్, డీఈ దస్తగిరి, తహశీల్దార్ లోకనాథ్ పిళ్ళై, ఎంపిడిఓ కష్ణయ్య, ఎంపిపి సరితా, జడ్పీటీసీ ప్రసాద్‌రెడ్డి, ఎఎంసి చైర్మన్ కమలాకర్‌రెడ్డి, మండల అధ్యక్షులు మణి, జనార్ధన్, మహేష్, ఏకాంబరం, డిసిసిబి డైరెక్టర్ బాల సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

సరుకుల కోసం సంచుల ఎదురుచూపు



సంచులు లైన్‌గా ఏర్పాటు చేసుకున్న స్థానికులు

ప్రజాశక్తి- సోమల: చౌక దుకాణాల ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరుకులు కార్డుదారులకు ఎప్పుడు ఇస్తారు ఏమో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో చౌక దుకాణాల వద్ద ప్రజలు సంచులను, రాళ్ళను ముందస్తుగా ఉంచి వారి స్థానాన్ని రిజర్వేషన్ చేసుకుంటున్నారు. మండల కేంద్రంలోని రామాలయం సమీపంలో ఉన్న చౌకదుకాణం వద్ద ఆదివారం ఉదయం నిత్యావసర సరుకుల కోసం కార్డుదారులు ముందస్తుగా గుర్తు కోసం సంచులను రాళ్లను లైనుగా ఏర్పాటు చేయడాన్ని ప్రజాశక్తి గమనించింది. నిత్యావసర సరుకులు ఎప్పుడు ఇస్తారో తెలియపోవడంతే ఇచ్చే సమయానికి వచ్చి సరుకులు తీసుకునేందుకు ఈ విధంగా ఏర్పాటు చేసుకున్నట్లు స్థానిక కార్డుదారులు తెలిపారు.

వర్షపు నీరు కాదు.. మురుగు..



ప్రజాశక్తి- సోమల: సోమల –నంజంపేట మార్గమధ్యంలోని జీడి రేవుల వంక (సరస్వతీపురం) వద్ద రోడ్డుపై మురుగునీరు ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగునీటి కాలువలు నిర్మించకపోవడంతో గ్రామంలోని మురుగునీరు మొత్తం రోడ్డుపైకి వచ్చి మురుగు నీటి వల్ల ఏర్పడిన పెద్దపెద్ద గోతులలో నిల్వ చేరుతోంది. దీంతో వాహనదారులకు నడిచి వెళ్లే వారికి ఇబ్బందికరంగా ఉంది. ముఖ్యంగా వర్షం పడినప్పుడు గోతులలో నీరు పూర్తిగా నిండిపోయి నడిచి వెళ్లే వారికి ఇబ్బందికరంగా మారుతోంది. వాహనాలు కూడా ఎక్కడ లోతైన గుంత ఉందో ఎక్కడ రోడ్డు ఉందో తెలియని పరిస్థితులలో ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. నంజంపేట పంచాయతీ వారు మురుగునీటి కాలువలను నిర్మించి గ్రామంలోని మురుగునీరు ప్రధాన రహదారిపైకి రాకుండా నిర్వహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

రాష్ట్ర స్థాయి పోటీలకు

'బృందావన్' విద్యార్థుల ఎంపిక



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: స్థానిక సంతపేటలోగల బందావన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ విద్యార్థులు 67 ఎస్‌జిఎఫ్‌యూ–19 నెట్‌బాల్ డిస్టిక్ సెలక్షన్‌లో పాల్గొని రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం సంతోషంగా ఉందని పాఠశాల కరస్పాండెంట్ శైలజ కుమారి తెలిపారు. అనంతరం ఎంపికైన ఎన్.చరణ్, ఏ.దోని, డి. సాయి సంతోష్, కేజై. గణేష్, టి.మోహిత్, సి. రెడ్డికష్ణ, పి. కీర్తిశ్రీ, టి.హరిణి విద్యార్థులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఈటీలు టీ.బేబీ రాజ్, బి.మురళి, కె.కిరణ్ కుమారి పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారం ఉపాధ్యాయున్ని నియమించాలి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరులోని కస్తూరిబా బాలికల నగర పాలక ఉన్నత పాఠశాలలో నిబంధనలకు విరుద్ధంగా ఫిజిక్స్ ఉపాధ్యాయుడు స్టీఫెన్‌ను ఎలా నియమించారు. 50 ఏళ్లు పైబడిన పురుష ఉపాధ్యాయులని కస్తూరి బాలికల నగర పాలక ఉన్నత పాఠశాలలో నియమించాలని నిబంధన ఉన్నప్పటికీ 30ఏళు నిండిన ఉపాధ్యాయుని ఎలా విద్యాశాఖ నియమించిందని సిపిఐ చిత్తూరు జిల్లా కార్యదర్శి ఎస్ నాగరాజు ఒక ప్రకటనలో ప్రశ్నించారు. ఇదే విషయాన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు డీఈవో దష్టికి తీసుకువెళ్లినా ఎందుకు చర్యలు చేపట్టలేదన్నారు. దీనిపైన డీఈఓ స్పందించి కస్తూరిబా బాలికల నగర పాలకోన్నత పాఠశాలలో మహిళ ఉపాధ్యాయిని నియమించకపోతే జిల్లా కలెక్టర్ దష్టికి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్తామని హెచ్చరించారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం...

చీపురు పట్టి మార్కెట్‌ను శుభ్రం చేసిన కమిషనర్



ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా జీవించగలమని, ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని నగర కమిషనర్ డాక్టర్ జె.అరుణ పిలుపునిచ్చారు. స్వచ్ఛతా హీసేవ, 'పరిశుభ్రత కోసం ఒక గంట శ్రమదానం' కార్యక్రమంలో భాగంగా ఆదివారం నగర కమిషనర్ అరుణ నగరపాలక సంస్థ బస్టాండ్ వద్దనున్న మార్కెట్ రోడ్లను చీపురు పట్టి శుభ్రం చేశారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ. పరిశుభ్రత అంశాన్ని ప్రతిఒక్కరు వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలన్నారు. గహాలను, పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఊరు శుభ్రంగా ఉంటుందని, తద్వారా ప్రజలు ఆరోగ్యకర జీవనం సాగించేందుకు వీలవుతుందన్నారు. పరిసరాల శుభ్రత కోసం



ప్రతిఒక్కరూ రోజు కొంత సమయం కేటాయించాలన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య కార్మికులు నిత్యం శ్రమిస్తుంటారని అభినందించారు. ఈకార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ షన్ని షర్మిల, ఎంహెచ్ఓ డాక్టర్ లోకేష్, సానిటరీ ఇన్స్పెక్టర్లు, వార్డు పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆదివారం నగరపాలక సంస్థ పరిధిలోని 50 వార్డుల్లోనూ స్థానిక కార్పొరేటర్లను భాగస్వామ్యంతో వార్డు పర్యావరణ పారిశుద్ధ్య కార్యదర్శులు పరిశుభ్రత కోసం ఒక గంట శ్రమదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. వార్డు పరిధిలో ఎంపిక చేసిన ప్రాంతాల్లో శుభ్రం చేయడంతో పాటు, గతంలో అపరిశుభ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి శుభ్రంగా మార్చడంతో పాటు మొక్కలు నాటారు. పరిశుభ్రత కార్యక్రమాలపై అవగాహన కల్పిస్తూ ర్యాలీలు, మానవహారం నిర్వహించారు.

స్వచ్ఛభారత్ సేవా కార్యక్రమాల్లో సంసిధ్ క్యాంఫర్డ్ విద్యార్థులు

స్వచ్ఛభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శరవణపురం తపోవనంలోని వద్ధాశ్రమంలో సంసిధ్ క్యాంఫర్డ్ పాఠశాల వెస్ట్ విద్యార్థులు పాల్గొన్నారు. అక్కడ పరిసరప్రాంతాల్లో ఉన్న చెత్తను తొలగించి శుభ్రం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు అరుణ్ కుమార్, మేనేజర్ సుమిత్, ఉపాధ్యాయులు, కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.



తపోవనంలో సేవా కార్యక్రమాల్లో పాఠశాల విద్యార్థులు

గజ దాడులు మళ్లీ మొదలు..

పంటలు నష్టపోతున్న రైతన్నలు

ప్రజాశక్తి - సోమల : సదుం మండలం చెరుకువారిపల్లి గ్రామపరిధిలోని పలు రైతులకు చెందిన వ్యవసాయ పంట పొలాలపై ఏనుగుల మంద దాడిచేసి తీవ్రంగా రైతులను నష్టపరిచినట్లు గ్రామస్తులు, రైతులు ఆరోపించారు. శనివారం రాత్రి ఏనుగుల మంద ఉప్పరపల్లి నుండి ఈశ్వరయ్య, బాలకృష్ణ, రెడ్డమ్మ, మోహన్ అనే రైతులకు చెందిన చెరకు తోటలను పూర్తిగా ధ్వంసం చేశాయి. విషయం తెలుసుకున్న రైతులు ఏనుగులను తరిమెందుకు టపాసులు తీసుకువెళ్లి పేల్చారు. గుంపులో నుండి రెండు ఏనుగులు రైతులు వైపు దూసుకురావడంతో రైతులు అక్కడి నుండి పరుగులు తీశారు. గంటా వారిపల్లి, గురికానివారిపల్లి గ్రామ సమీపంలో ఏనుగులు సంచరిస్తూ రైతుల పంట పొలాలను ధ్వంసం చేసి రైతులకు తీవ్రనష్టాన్ని కలిగిస్తున్నట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఏనుగుల భారీ నుండి రైతుల పంట పొలాలు కాపాడేందుకు ప్రభుత్వం ఏనుగుల మందను ఈ ప్రాంతం నుండి దూరంగా తరిమివేయాలని రైతులు కోరుతున్నారు.



ఏనుగుల దాడిలో ధ్వంసమైన చెరకు పంట

అప్పుల బాధతో ఆటోడ్రైవర్ ఆత్మహత్య



తాలూకా పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న పురుషోత్తం కుటుంబ సభ్యులు

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్
అప్పుల భారం పెరిగి, వడ్డీలు చెల్లించలేక ఓ ఆటోడ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన చిత్తూరు జిల్లా చిత్తూరు నగరంలో ఆదివారం చోటు చేసుకుంది. బాధితుల తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మృతుడు పురుషోత్తం ఆచారి (45) చిత్తూరు నగరంలోని వైఎస్సార్ కాలనీలో నివాసముండేవాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతనికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. నాలుగేళ్ల క్రితం కుటుంబ అవసరాల నిమిత్తం రూ.3ల వడ్డీకి రూ.70వేలు వేలాయుధం, వసుధల వద్ద అప్పుగా తీసుకున్నాడు. నాలుగేళ్లుగా వడ్డీ చెల్లించకపోవడంతో అసలు, వడ్డీ రూ.2లక్షలకుపైగా అయ్యింది. అంతేకాకుండా ఇతరుల వద్ద కూడా రూ.2లక్షలకు పైగా అప్పులు ఉన్నట్లు సమాచారం. అప్పు పెరగడంతో వేలాయుధం కోర్టులో కేసు వేయడంతో అప్పు వడ్డీల కింద వారు వైఎస్సార్ కాలనీలోని (ప్రస్తుత విలువ) రూ.3లక్షలు విలువ చేసే ఇంటిని జమ చేసుకున్నారు. అప్పుల బాధ ఎక్కువడంతో భార్య పురుషోత్తంను ఇద్దరు పిల్లల్ని వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. అప్పులు తీర్చే మార్గం లేకపోవడం, ఉన్న ఇళ్లు పోవడం, భార్య వదిలి వెళ్లడంతో మస్తాపానికి గురైన పురుషోత్తం ఆదివారం ఉదయం ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో కుటుంబ సభ్యులు పురుషోత్తం ఆత్మహత్య చేసుకోవడానికి కారణమైన వేలాయుధం, వసుధలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ స్థానిక పోలీసు స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. ఇదిలా ఉండగా సదరు వ్యక్తులపై పోలీసులు కేసు నమోదు చేయకుండా వన్ టౌన్ పరిధి, టూ టౌన్ పరిధి అంటూ తిప్పు కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధిక వడ్డీలు చెల్లించాలని వేధింపుల వలనే పురుషోత్తం చనిపోయాడని, పిల్లలు ఇద్దరూ అనాధలయ్యారని వారి కుటుంబ సభ్యులు కన్నీటిపర్యంతమయ్యారు.

నేడు బాబుకు మద్దతుగా నిరాహార దీక్ష

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
శాంతియుత పోరాటానికి ప్రతీక అయిన గాంధీ జయంతి రోజున జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు రాజమండ్రి జైలులో చేస్తున్న ఒకరోజు నిరాహార దీక్షకు మద్దతుగా నారా భువనేశ్వరి ఒకరోజు నిరాహార దీక్ష చేపట్టబోతున్నారు. సంఘీభావం తెలుపుతూ ప్రతి నియోజకవర్గంలో ఉదయం నుండి సాయంత్రం 5గంటల వరకు జిల్లా పార్టీ, నియోజకవర్గస్థాయి, మండల స్థాయి, గ్రామస్థాయి నాయకులు కార్యకర్తలు మాజీ ప్రజాప్రతినిధులు, మహిళలు, తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులు అందరూ కలిసి కట్టుగా నిరాహార దీక్ష చేపట్టి చంద్రబాబు నాయుడుకు మద్దతు తెలపాలని టిడిపి నాయకులు పులివర్తినాని, కోందడ యాదవ్ పిలుపునిచ్చారు.

'జగనన్న సురక్ష'తో అందరికీ ఆరోగ్యం..

ఇంటివద్దే ఏడు రకాల వైద్యపరీక్షలు
జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి ప్రభావతిదేవి

ఇంటర్వ్యూ

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్:
జగనన్న సురక్ష అనే పథకాన్ని ప్రభుత్వం ప్రతి ఇంటి వద్దకు వెళ్లి ప్రజలకు ప్రభుత్వం నుండీ మెరుగైన వైద్యం అందించేందుకు ఈ పథకాన్ని అమలు చేస్తోంది. గత నెల 30వ తేది నుండీ ఈ పథకం ద్వారా వైద్యపరీక్షలు నిర్వహించడం జరుగుతోంది. ఇప్పటికే వైద్యఆరోగ్యశాఖ అధికారులు జిల్లా వ్యాప్తంగా సర్వే నిర్వహించారు. సర్వే ఆధారంగా వైద్యపరీక్షల చేయడం జరుగుతుంది. ప్రతి ఇంట్లోని వ్యక్తి ఆరోగ్య పరిస్థితి ప్రొఫైల్ సిద్ధం చేయడం జరుగుతోంది.



ఇందులో బ్లెడ్‌గ్రూప్, ఏఏ రకాల జబ్బులతో బాధపడుతున్నారు. వీటిలో దీర్ఘకాలీక వ్యాధులతో బాధపడుతున్నారా.... అనే విషయాలను పొందుపర్చడం జరుగుతుంది.

ప్రజాశక్తి: జగనన్న సురక్ష పథకంలో ఎన్ని రకాల వైద్యపరీక్షలు నిర్వహిస్తారు...?

డిఎంఅండ్‌హెచ్ఓ: జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా గ్రామం, వార్డులో పూర్తిగా మ్యాప్ చేయబోతున్నాం. ప్రతి గ్రామం, వార్డులో ప్రతి ఇంటినీ, జల్లెడ పట్టి, ఏ ఇంట్లో ఎలాంటి అనారోగ్య సమస్యలు ఉన్నాయి అనే విషయాన్ని తెలుసుకొనేందుకు ఆ ఇంటి దగ్గరే 7 రకాల పరీక్షలు అక్కడిక్కడే వైద్య ఆరోగ్యశాఖ యంత్రంగాం వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు.

ప్రజాశక్తి : నగరపాలక సంస్థలో ఏవిధంగా జగనన్న సురక్ష కార్యక్రమం జరుగుతుంది....?

డిఎంఅండ్‌హెచ్ఓ: నగరపాలిక, పురపాలికల్లో ప్రజలక అందుబాటులో ఉండే సెంటర్లలో వైద్యపరీక్షలు నిర్వహించేలా ఆదేశాలు జారీ చేయడం జరిగింది. ఇంటింటా సర్వేలో వైద్యపరీక్షల కోసం గుర్తించిన వారికి ఈ సెంటర్లకు వద్దకు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది తీసుకెళ్ళి వైద్యపరీక్షలు చేయిస్తారు. రిపోర్టుల ఆధారంగా వైద్యం అందించడం జరుగుతుంది.

ప్రజాశక్తి : జిల్లాలో ఎన్ని క్యాంపులు ఏర్పాటు చేశారు. ఎన్ని రకాల వ్యాధులకు పరీక్షలు నిర్వహిస్తున్నారు?

డిఎంఅండ్‌హెచ్ఓ: జిల్లాలో 478 క్యాంపులలో ప్రత్యేక వైద్యులను ఏర్పాట్లు చేశాం, 11 రకాల వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్యులు వైద్యసేవలను అందిస్తున్నారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలి. ప్రత్యేక క్యాంపులో వైద్య సేవలు పొందేందుకు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నారు.

ప్రజాశక్తి: ఇంటింటా సర్వేలో గుర్తించిన అంశాలు ఏమిటి....?

డిఎంఅండ్‌హెచ్ఓ: 15 రోజుల నుంచి ప్రభుత్వం నిర్ణయించిన విధి విధానాల మేరకు దశలవారీగా వాలంటీర్లు వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి ఇంట్లోని ప్రతిఒక్కరిని పలకరించి వారి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని అనారోగ్యం ఉన్న వారిని గుర్తించి ఆ వ్యాధులకు సంబంధించి పరీక్షలు చేసి తగిన మందులు ఇవ్వడం జరిగింది. అనంతరం చికిత్సల కోసం అవసరమైన డాక్టర్ల వద్దకు వెళ్లేందుకు టోకన్లు ఇవ్వడం జరిగింది. టోకెన్లు పొందిన వారు ప్రత్యేకంగా నిర్వహిస్తున్న శిబిరాలకు రావడం, శిబిరాలలో 11 రకాల వ్యాధులకు సంబంధించి ప్రత్యేక వైద్యులు సేవలు అందిస్తున్నాం. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నాం.

ప్రజాశక్తి: జగనన్న సురక్షలో ఎంతమంది వైద్యసిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు....?

డిఎంఅండ్‌హెచ్ఓ: గత నెల 30వ తేదీ నాటికి 32 మెడికల్ క్యాంపులు ప్రారంభమయ్యాయి. మొత్తం 13,026 మంది ఓపీలు పొందారు. 66 మంది పిహెచ్‌సీ డాక్టర్లు, 79 మంది స్పెషలిస్టు డాక్టర్లు వైద్యసేవలందిస్తున్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది. సచివాలయల్లో పని చేస్తున్న నర్సులు, ఏఎన్ఎంలు వైద్యసేవలందిస్తున్నారు.

-డాక్టర్ ప్రభావతిదేవి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

ప్రజాశక్తి -బైరెడ్డిపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుల ఉన్నత పాఠశాలలో గాంధీ జయంతి సందర్భంగా మారుతి ఫౌండేషన్ చైర్మన్ నాగరాజు సకారంతో పిఇఎస్ హాస్పిటల్ కుప్పం లోని కంటినిపుణులైన డాక్టర్లచే ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1 గంట వరకు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు ఈ అవకాశాన్ని మండలంలో కంటి వ్యాధులతో బాధపడుతున్న వారు సద్వినియోగం చేసుకోవాలని వారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

మహిళా బిల్లులో బీసీ వాటా ఎంత?

జిల్లా బీసీ సంఘం అధ్యక్షులు లక్ష్మీ ప్రసన్న కుమార్

ప్రజాశక్తి -బంగారుపాళ్యం: కేంద్ర ప్రభుత్వం తీసుకున్న మహిళ బిల్లులో బీసీల మహిళా వాట ఎంతని తెలపలేదని జాతీయ బీసీ సంక్షేమసంఘం జిల్లా అధ్యక్షులు పిబి లక్ష్మిప్రసన్నకుమార్ అన్నారు. ఆదివారం మండల కేంద్ర లో లో పూతలపట్టు నియోజకవర్గ కార్యవర్గ సమావేశం నియోజకవర్గ అధ్యక్షులు కోదండ ఆధ్వర్యంలో జరిగినది .ఈ సందర్భంగా జిల్లాఅధ్యక్షులు లక్ష్మీప్రసన్నకుమార్ మాట్లాడుతూ జనాభా ప్రాదిపతికన బిసి లకు దక్కవలసిన వాటాలు అన్నింటా కల్పించాలని మహిళా బిల్లు పెట్టడం సంతోషదాయకమని కానీ అందులో బి సి మహిళలకు దక్కవలసిన వాటా చెప్పలేదని, వెంటనే బిసిమహిళలకు దక్కవలసిన వాటా బిల్ పెట్టాలని , కులాల వారీగా జనాభాను లెక్కించి బిసి లకు చేరవలసిన అన్ని రిజర్వేషన్స్ కల్పించాలన్నారు. చట్టసభల్లో రిజర్వేషన్ కల్పించాలని బీసీలన్ను అన్ని విధాలుగ్గా ఎదుగుదలకు తోడ్పాటును అందించాలన్నారు. అనంతరం పూతలపట్టు నియోజకవర్గం ప్రచార కమిటీ అధ్యక్షులుగా ఉదయకిరణ్ ఏకగ్రీవంగ్గా ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో పూతలపట్టు ఐరాల జాతీయ బిసి సంఘ అధ్యక్షులు రమేష్. రమణ ,మురళి పలువురు బీసీలు పాల్గొన్నారు.

నేడు అన్ని పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామసభలు నిర్వహించాలి: ఈఓఆర్‌డి



ప్రజాశక్తి -సోమల: అక్టోబర్ 2 గాంధీ జయంతి సందర్భంగా మండలంలోని అన్ని సచివాలయాల వద్ద పంచాయతీ కార్యాలయాల వద్ద గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించాలని ఈవో ఆర్డీ లక్ష్మీదేవి తెలిపారు. గ్రామ సభలలో సర్పంచ్ ఎంపీటీసీ వార్డు మెంబర్లు వాలంటీర్లు పాల్గొనాలని, గ్రామ సభలలో పాల్గొనే ప్రజలు ఇచ్చే అర్జీలను తీసుకొని సమస్యను పరిశీలించి అవసరమైతే అప్పటికప్పుడు పరిష్కరించి మిగిలిన అర్జీలను ఆన్లైన్ చేసి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.



వృద్ధులకు పండ్లను అందిస్తున్న ఎంపిపి లతబాలాజీ

వృద్ధులు ఆరోగ్యంగా ఉండాలి

ప్రజాశక్తి - కార్వేటినగరం : ప్రతి వృద్ధురాలు తల్లిదండ్రులతో మీరాంతంగా ఉండాలని దేవుని ప్రార్థించి ఉన్న ఎంపీపి లతబాలాజీ, స్థానిక సర్పంచ్ ధనంజయ వర్మ అన్నారు. అనంతరం వృద్ధులకు పండ్లు,స్వీట్లు పంపిణీ చేశారు. ఆదివారం ప్రపంచ వృద్ధుల దినోత్సవం పురస్కరించుకొని రాస్ వృద్ధాశ్రమంలో ఘనంగా నిర్వహించారు. వారానికి ఒకసారి వైద్యులచే పరీక్షలు నిర్వహించి మందులు ఉచితంగా పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ శాంతి శేషాద్రి, జిల్లా వైసీపీ కార్యదర్శి గోపీనాథ్, రాస్ కోఆర్డినేటర్ ప్రకాష్,తదితరులు పాల్గొన్నారు.



చంద్రశేఖర్ కు గౌరవ డాక్టరేట్

ప్రజాశక్తి -వెదురుకుప్పం : చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం పెరుమాళ్ల పల్లెకు చెందిన గాలం చంద్రశేఖర్ ను గౌరవ డాక్టరేట్‌తో నవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితి సత్కరించి గౌరవించింది. తెలంగాణ రాష్ట్రం వరంగల్ జిల్లా హనుమకొండలోని హోటల్ శ్రేయలో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో భద్రాచలం ప్రధాన అర్చకులు లక్కా వజ్జుల విజయ సుబ్రహ్మణ్యం, విశ్వ జ్యోతి విజ్ఞాన సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ విశ్వనాథ్, ప్రముఖ జ్యోతిష్య పండితులు, నంది అవార్డు గ్రహీత డాక్టర్ చక్రధర్ సిద్ధాంతి ఈ గౌరవ డాక్టరేట్ ను చంద్రశేఖర్ అందించి ఘనంగా సత్కరించారు. ఆయన ఇన్సూరెన్స్ రంగంలో అందించిన సేవలను కొనియాడారు. భవిష్యత్తులో చంద్రశేఖర్ ఉన్నత స్థానాలను అధిరోహించాలని వారు కాంక్షించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇన్సూరెన్స్ రంగంలోనూ, సామాజిక కార్యక్రమాలలో తాను ఎప్పుడు ముందుంటానని తెలిపారు. తన సేవలను గుర్తించిన నవనిర్మాణ ప్రజా సంక్షేమ సమితికి ఆయన సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. గౌరవ డాక్టరేటు తనలో మరింత బాధ్యత పెంచిందని, సేవకు బద్ధుడనై సామాజిక సేవా కార్యక్రమాలలో ఎప్పుడు ముందుంటానని ఆయన అన్నారు. గౌరవ డాక్టర్ రేటు రావడానికి పరోక్షంగా సహకరించిన ప్రతి ఒక్కరికి చంద్రశేఖర్ ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే నిరాదరణకు గురైన అనాధలకు తాను బాసటగా నిలుస్తానని చెప్పారు.

శివాజి గణేషన్ కు ఘన నివాళులు


ప్రజాశక్తి -నగరి : ప్రముఖ శివాజి గణేషన్ 95 వ జయంతి సంధర్భంగా వైసిపి రాష్ట్ర ట్రేడ్ యూనియన్ జనరల్ సెక్రెటరీ కేజే కుమార్ ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆదివారం చెన్నైలో శివాజీ గణేషన్ నివాసంలో సినీ నటుడు ప్రభు వారి కుటుంబ సభ్యులను మర్యాదపూర్వకంగా కలిశారు. సంధర్భంగా కేజే కుమార్ మాట్లాడుతూ శివాజీ నేషనల్ పిక్చర్స్ వారి పరాశక్తి ద్వారా చిత్రరంగ ప్రవేశం చేశారన్నారు. చిత్రనిర్మాణం సమయంలో ఎన్నో ఇబ్బందుల్ని ఎదుర్కొని చివరికి ద్రావిడ మున్నేట్ర కజగం వ్యవస్థాపకులు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి అణ్ణాదురై అండతో సినిమా పూర్తిచేసి మహానటుడిగా ఎదిగారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తమిళ హీరో ప్రభు, రామ్ కుమార్ గణేషన్. విక్రమ్ ప్రభు. వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు రైటింగ్ ప్యాడ్స్,పెన్స్ పంపిణీ

ప్రజాశక్తి -యాదమరి: పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఆదివారం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నతపాఠశాలలో విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ చేశారు. యాదమరి ఉన్నత పాఠశాలలో1984 ఎస్.ఎస్.సి పూర్వ విద్యార్థులైన పి.చంద్రశేఖర్ నాయుడు,కె కనకాచారి ప్రస్తుతం 10 తరగతి 190 మంది విద్యార్థులకు 10000 రూపాయుల విలువ గల విద్యాసామాగ్రి , స్వీట్స్ పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో పాఠశాల హెచ్‌యం గిరిరాజా, హైస్కూల్ విభాగం పిఆర్‌టియు మహిళ నాయకురాలు త్రివేణి, కోశాధికారి తులసిప్రసాద్ పాల్గొన్నారు.

చిత్తూరు జడ్పీ చైర్మన్‌ను కలిసిన వైఎస్ఆర్‌టీఎఫ్ నాయకులు

ప్రజాశక్తి -పలమనేరు: పలమనేరు పట్టణానికి ఆదివారం ఓ ప్రైవేట్ కార్యక్రమంలో పాల్గొనడానికి విచ్చేసిన చిత్తూరు జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులును పలమనేరు డివిజన్ వైఎస్ఆర్ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా 2023 ఏప్రిల్ నెల 1998 ఏంటిఎస్ ఉపాధ్యాయులకు సంబంధించి అనేక మండలాలలో వేతనాలు ఇంకా అందలేదని చైర్మన్ దృష్టికి తెచ్చారు. ఇంకా జెడ్పీ ఉపాధ్యాయుల పిఎఫ్ స్లిప్పులు ఆన్లైన్ లో చూపడం లేదన్నారు. వీటిపై ఆన్లైన్ లో చూపేవిధంగా వెంటనే చర్యలు తీసుకోవాలని చైర్మన్ ను కోరారు. ఈ విషయాలుపై జెడ్పీ చైర్మెన్ శ్రీనివాసులు స్పందిస్తూ సంభందిత అధికారులకు వెంటనే సమస్యలను పరిష్కరించాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైఎస్ఆర్ టిఎఫ్ గౌరవ సలహాదారు ఎన్.సోమచంద్రారెడ్డి, కోశాధికారి ఏ.ఆర్.కుమార్, డివిజన్ ప్రధాన కార్యదర్శి పి.ఎఫ్.రోషన్ ఆలీఖాన్, కోశాధికారి పి.రమేష్, స్థానిక మధు, వాణీ కళాశాలల అధినేత కృష్ణమూర్తి రెడ్డి వున్నారు.



జడ్‌పి చైర్మన్‌ను కలిసిన వైసిపి నాయకులు

మంచిని మరవం.. అండగా నిలబడతాం

-వైసిపిలోకి 40 టీడీపీ కుటుంబాలు
-కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానం
-కలసి పనిచేయండి అందరికీ మంచి చేద్దామన్న మంత్రి ఆర్కేరోజా

ప్రజాశక్తి -నగరి : తాము గతంలో టీడీపీ పార్టీకి పనిచేసినా మాపై పక్షపాతం చూపకుండా ప్రభుత్వం అన్నివిధాలుగాను తమకు అండగా ఉందని, ప్రతి సంక్షేమ పథకం పార్టీకు అతీతంగా ముఖ్యమంత్రి, మంత్రి ఆర్కే రోజా తమకు అందిస్తున్నారని ఇంతలా మంచిచేసే వారికి తాము అండగా నిలబడతామంటూ మండలంలోని కృష్ణారామాపురం గ్రామానికి చెందిన 40 టీడీపీ కుటుంబాలు వైసిపి తీర్థం పుచ్చుకున్నాయి. ఆదివారం వైసిపిలో చేరేందుకు మంత్రి క్యాంప్ కార్యాలయం వద్దకు టీడీపీ నాయకులు ప్రకాష్ రెడ్డి, రామూర్తి రెడ్డి, పుణ్యకోటి రెడ్డి, హరిబాబు రెడ్డి, త్యాగరాజు రెడ్డి, హరినాద రెడ్డి, చిదంబర రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, లోకనాధం రెడ్డి నాయకత్వంలో విచ్చేసిన వారిని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజనసర్వీసుల, క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆప్యాయంగా మంత్రిని పలకరించిన వారు తాము అనాధిగా టీడీపీ పార్టీలో ఉన్నామని గతంలోను ఆ పార్టీకే పనిచేశామని, ఓట్లు వేశామని అన్నారు. అయితే టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికంటే ఇప్పుడే తమకు ఎక్కువగా మేలు జరిగిందన్నారు. మంచి చేసిన వారిని మరవకూడదని అది మానవ ధర్మమన్నారు. అందుకే అందరం కలిసి నిర్ణయించుకొని వైసిపిలో చేరామన్నారు. మంత్రి ఆర్కేరోజాకు అండగా నిలబడతామన్నారు.



వైసిపిలో చేరిన వారితో మంత్రి ఆర్‌కెరోజా

ఘనంగా వైస్ ఎంపీపీ హరిబాబు పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-గంగాధర నెల్లూరు: గంగాధర నెల్లూరు వైస్ ఎంపీపీ తలారి హరిబాబు పుట్టినరోజు సందర్భంగా భారీ ఎత్తున కేక్ కట్ చేసి వైసిపి నేతల శుభాకాంక్షలు తెలియజేశారు. స్థానిక పెట్రోల్ బంక్ నుండి అంబేద్కర్ విగ్రహం వరకు మేళతాళాలతో బాణసంచా వేడుకలతో వైసిపి కార్యకర్తలు భారీగా తరలివచ్చి హరిబాబుకు దృశ్యాలవ తో పూలమాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తలారి హరిబాబు మాట్లాడుతూ తనకు రాజకీయ జన్మనిచ్చిన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామికి రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఉపాధ్యక్షులు విజయానంద రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సన్మానంతో తనపై మరింత బాధ్యత ఉందని పార్టీ అభివృద్ధితో పాటు కార్యకర్తల మనోభావాలు దెబ్బతినకుండా పార్టీ అభివృద్ధి కోసం మరింత కృషి చేస్తానని ఈ సందర్భంగా హరిబాబు అన్నారు . ఈ కార్యక్రమంలో వైసిపి నేతలు గౌతమ్ , వినోద్ , జగదీష్ , గిరి , రుద్ర రెడ్డి, వేణు యోవాన్ వంశీలతో పాటు పలువురు పాల్గొని హరిబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.



వైస్‌ఎంపిపి హరిబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న వైసిపి నాయకులు

అధైర్య పడకండి అండగా ఉంటా..

- టిడిపి ఇన్‌చార్జి డాక్టర్ థామస్

ప్రజాశక్తి-గంగాధర్ నెల్లూరు: 'టిడిపి కార్యకర్తలు ఎవరు అధైర్య పడకండి అండగా ఉంటా' అంటూ గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ థామస్ అన్నారు. ఆదివారం చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గంగాధర నెల్లూరులో 20వ రోజు రిలే నిరాహార దీక్ష శిబిరం కొనసాగింది. ఈ కార్యక్రమానికి హాజరైన గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి డాక్టర్ థామస్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు త్వరలో బయటకు వస్తారని కార్యకర్తలు ఎవరు అధైర్య పడకండి అని భరోసా ఇచ్చారు. చంద్రబాబు నాయుడు తిరిగి బయటకు వచ్చేంతవరకు పార్టీ ఆదేశాల మేరకు కార్యక్రమాలు కొనసాగాలన్నారు గత 20 రోజులుగా గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ టిడిపి నేతలు కార్యకర్తలు రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని విజయవంతం చేస్తున్నారన్నారు. చంద్రబాబు నాయుడు అరెస్టుతో దేశంలోనే కాకుండా ప్రపంచంలో అన్ని దేశాల ప్రజలు అక్రమ అరెస్టుకు నిరసనగా పలు నిరసన కార్యక్రమాలు చేపడుతున్నారని చంద్రబాబు నాయుడు కేవలం ఆంధ్ర రాష్ట్రానికి పరిమితం కాదని దేశంలోనే అతిపెద్ద నాయకుల జాబితాలో చంద్రబాబు నాయుడు పేరు ఉందని రానున్న శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలో టిడిపి విజయం సాధించి మరో పర్యాయం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి కావడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాస్, రుద్రయ్య నాయుడు, చెంగల్రాయ్ యాదవ్, లోకనాథ్ రెడ్డి ,జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్, టిడిపి నేతలు దేవసుందరం గుండయ్యశివప్రసాద్, మోహన మురళి, గోపి పలువురు టిడిపి నేతలు పాల్గొన్నారు.



దీక్షా శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ థామస్

స్కూల్ కమిటీ చైర్మన్‌కు పాముకాటు

ప్రజాశక్తి -వెదురుకుప్పం : మండలంలోని మాంబేడు గ్రామంలో ప్రాథమికోన్నత పాఠశాల కమిటీ చైర్మన్ పాముకాటుకు ఆదివారం గురైనట్లు గ్రామస్తులు తెలిపారు.. మండలంలోని, మాంబేడు పంచాయతీ , చిన్నమ్మ రెడ్డి కండ్రిగ గ్రామానికి చెందిన జీవితం (36) తన వ్యవసాయ పొలంలో పనులు చేస్తుండగా పాము కాటుకు గురైనట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు హుటా హుటిన ఆమెను తిరుపతిలోని నారాయణాద్రి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతుంది. పర్యవేక్షించిన డాక్టర్లు ఆమె పరిస్థితి ఆందోళనకరంగా ఉందని 24 గంటలు గడిస్తే కానీ చెప్పలేమని చెప్పినట్లు గ్రామస్తులు చెబుతున్నారు.



నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

వైసిపి ప్రభుత్వాన్ని సాగనంపాలి: టిడిపి

ప్రజాశక్తి -బంగారు పాళ్యం: కండ్లుండి చూడలేని ప్రభుత్వాన్ని సాగనంపాలని జిల్లా సర్పంచుల సంఘ అధ్యక్షులు కోక ప్రకాష్ నాయుడు అన్నారు. ఆదివారం మండల కేంద్ర లోని బిపికెన్ కాంప్లెక్స్ వద్ద వాణిజ్య విభాగ అధ్యక్షులు వంశి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి టిడిపి అధ్యక్షులపై అక్రమ కేసులు బనాయించి పాలన సాగించాలని ఉద్దేశంతో ఉన్నారని ఇది ఎంతకాలం సాగదన్నారు. అనంతరం కండ్లకు గంతులు కట్టుకుని రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు .ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ గౌడ్, మాజీ ఎంపీటీసీ వెంకట స్వామి, నాయకులు మంజు ,సూరి ,రమేష్, చంద్ర నాయుడు, రాధాకృష్ణన్, టిడిపి కార్యకర్తలు పాల్గొన్నారు.



వినూత్న నిరసన తెలుపుతున్న టిడిపి నాయకులు

పలమనేరు: రామరాజ్యం లాంటి ఆంధ్రప్రదేశ్ ను జగన్మోహన్ రెడ్డి రావణకాష్టంగా చేశాడని పలమనేరు పట్టణ టిడిపి నాయకులు విమర్శించారు. చంద్రబాబు అక్రమ అరెస్టును ఖండిస్తూ ఆదివారం టిడిపి ఆధ్వర్యంలో వినూత్న నిరసన చేపట్టారు. పలమనేరు పట్టణంలోని గాంధీనగర్ హిందూ స్మశాన వాటికలో రగిలే కాష్టం లా మండుతున్న కాగడాలను ఏర్పాటు చేసుకొని దాని ఎదుట బైఠాయించి నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలమనేరు పట్టణ అధ్యక్షులు ఆర్.బి.సి కుట్టి, ప్రధాన కార్యదర్శి గిరిబాబు, తెలుగు యువత నాయకులు మదన్ మోహన్ గౌడ్ తదితరులు ప్రసంగించారు. ఇప్పటికైనా కక్ష సాధింపు ధోరణిని ఈ ప్రభుత్వం వీడి చంద్రబాబును బేషరతుగా విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సుబ్రహ్మణ్యం గౌడ్, నాగరాజు,శ్రీధర్,అఫ్రోజ్, వీరప్ప, కిషోర్,చిన్నీ,రమేష్, మురళీ,లోకేష్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, బాబా జాన్, అబ్దుల్లా, వెంకటరమణ, పర్వీన్ పాల్గొన్నారు.

జైన్ ఫ్యాక్టరీ సిబ్బంది శ్రమదానం

ప్రజాశక్తి - గంగాధరనెల్లూరు: మండల కేంద్రమైన గంగాధరనెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్ గ్రౌండ్ లో 100 గొల్లపల్లె జైన్ ఫ్యాక్టరీ మేనేజర్, సిబ్బంది కలిసి శ్రమదానం చేశారు. స్వచ్ఛభారత్, స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో పాల్గొనాలని ఇచ్చిన పిలుపు మేరకు ఆదివారం గంగాధర నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్ గ్రౌండ్ లో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, ముళ్ళకంపలను జైన్ ఫ్యాక్టరీ మేనేజర్ షమీర్ శర్మ, పలువురు ఫ్యాక్టరీ సిబ్బంది కలిసి తొలగించి శుభ్రం చేశారు. అదేవిధంగా గంగాధర నెల్లూరు నీవానది బ్రిడ్జి పై గల మట్టిని చిత్తూరు – తచ్చూరు హైవే లో పనిచేసే కెసీసీ సిబ్బందితో పాటు సచివాలయ వాలంటీర్లు కలిసి శ్రమదానంతో తొలగించారు. గ్రామ ప్రజలు కె సి సి కంపెనీ ఆధ్వర్యంలో తొలగించడం జరిగింది.నెల్లేపల్లె పంచాయతీ లో పరిసరాలను శుభ్రం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర గ్రీనరీ బ్యూటీ డైరెక్టర్ గుణశేఖర్ రెడ్డి, సర్పంచ్ లు సుబ్రహ్మణ్యం, గంగయ్య, వైస్ ఎంపీపీ హరిబాబు , మండల స్వచ్ఛ భారత్ కోఆర్డినేటర్ మనోహర్ బాబు, పంచాయతీ కార్యదర్శి అంజాద్ భాషా పాల్గొన్నారు.



ప్రమాదంలో గాయపడ్డ మహిళ

ద్విచక్ర వాహనానికి అడ్డువచ్చిన ఆవు

అదుపుతప్పి కింద పడ్డ స్కూటరిస్టు

ప్రజాశక్తి -సోమల: సదుం మండలం ఊటుపల్లి గ్రామానికి చెందిన దంపతులు స్వగ్రామం నుండి సదుం బయలుదేరారు. ద్విచక్ర వాహనంపై ఇరువురు వెళుతుండగా మార్గమధ్యంలోని గొంగి వారి పల్లి సమీపంలోని రైస్ మిల్లు వద్ద రోడ్డుకు అడ్డంగా ఆవు రావడంతో అవును తప్పించే క్రమంలో ద్విచక్ర వాహనం అదుపుతప్పి మునాఫ్ సాబ్, జరీనాబి దంపతులిద్దరూ కింద పడిపోయారు. ఈ ప్రమాదంలో దంపతులకు తీవ్ర గాయా లుగా 108 వాహనం ద్వారా సదుం సి.హెచ్.సి ఆసుపత్రికి తరలించారు.

ముస్లింల అభివృద్ధి చంద్రబాబు తోనే సాధ్యం..

-కుప్పం నియోజకవర్గం పరిశీలకులు గాజుల ఖాదర్ బాషా

ప్రజాశక్తి - రామకుప్పం: చంద్రబాబు నాయుడు పై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఆదివారం రామకుప్పం మసీదులో ముస్లిం సోదరులు పెద్ద ఎత్తున ప్రార్థనలు.ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి బ్యాడ్ టైం స్టార్ట్ అయిందని వైసీపీ పని అయిపోయిందని గాజుల ఖాదర్ భాషా పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.రాష్ట్ర ప్రజలు 74 ఏళ్ల వయస్సు గల మాజీ ముఖ్యమంత్రిని రాజమండ్రి సెంట్రల్ జైల్లో పెట్టడం జగన్మోహన్ రెడ్డి దుర్మార్గపు చర్య ,కుట్రపూరిత చర్య అని ప్రతి ఒక్కరి నోట ఈరోజు వినిపిస్తున్న మాట ఇదే అన్నారు . జైల్లో కూడా సక్రమమైన వసతులు ఇవ్వకుండా, అనేక రకాలుగా ఇబ్బందులను తాడేపల్లి జగన్ రెడ్డి ఆదేశాలతో చేస్తున్నారన్నారు. చర్యకు ప్రతి చర్య అనేది తప్పకుండా ఉంటుందిఅన్నారు. కుట్రలు కుయుక్తులు పన్నిన వారి చరిత్ర గతంలో చూస్తే వారు కాలగర్భంలో కలిసిపోయారని అన్నారు.నియంతలా ప్రవర్తిస్తున్న ముఖ్యమంత్రి కి రాష్ట్ర ప్రజలు తొందరలోనే గుణపాఠం చెప్తారని.. రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు అందరూ కోరుకుంటున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో రామకుప్పం మండల అధ్యక్షులు ఆనంద్ రెడ్డి, సీనియర్ నాయకులు సర్దార్, సలాం, అక్బర్ సాబ్, అమానుల్ల, మండల మైనారిటీస్ అధ్యక్షులు ఆదిల్ భాష తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నిరాహార దీక్షలో ఐటీ ఉద్యోగులు

ప్రజాశక్తి-నగరి: లక్షల కుటుంబాలకు ఐటి ఉద్యోగాలతో భవిష్యత్తును ఇచ్చిన విజనరీ లీడర్ నారా చంద్రబాబు నాయుడుని,ఆయనపై తప్పుడు కేసులు బనాయించి నిర్బంధించి వేధించడం తగదని ఐటీ ఉద్యోగులు పేర్కొన్నారు. ఆదివారం నగరి మున్సిపాలిటీ ఆర్ డి ఓ ఆఫీస్ ఎదురుగా నిరాహార దీక్ష లో ఐటీ ఉద్యోగుల ఐటిడీపీ కార్యనిర్వాహక కార్యదర్శి గాలి గోపీనాథ్ పాల్గొని మాట్లాడుతూపే ఆధారాలు లేని స్కిల్ డెవలెప్మెంట్ కేసులో 45ఏళ్ల రాజకీయ జీవితంతో ఎన్నో లక్షల మందికి జీవితాలను ఇచ్చారని, ఆయనను 73ఏళ్ల వయస్సులో 20రోజులకు పైగా నిర్బంధించారని, ప్రతిపక్ష నేతను జైల్లో పెడితే ఓట్లు వస్తాయనే భ్రమలో జగన్ ఉన్నాడని ఎద్దేవా చేశారు. ఎటువంటి కంపెనీలను తీసుకురాలేకపోయారని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఎం.రాజేష్, నర్రావుల లక్ష్మీపతి, డి.సునీల్ కుమార్, చింతగుంపల నరేంద్ర, ఎం.దినకర్, కరవాటి రూప, పాదర్తి రాజేష్, బాబీ చౌదరి, రావిళ్ల ధనంజయులు, మోహన్, పి.హరి, వెంకటేష్ ప్రసాద్, ఐటీడీపీ సభ్యులు మాతయ్య, భాస్కర్ రెడ్డి, సుధాకర్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి, ప్రసాద్, క్రిష్ణన్, తులసిలింగం, బాలాజీ, బుజ్జిబాబు, మహేష్, మండల పార్టీ అధ్యక్షులు జి.జీవరత్నం నాయుడు(పుత్తూరు టౌన్), డి.రవికుమార్(పుత్తూరు రూరల్), జి రమేష్ బాబు(నగరి టౌన్), పి.వెంకటేశ్వరరావు(నింద్ర) తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి కుప్పం: మాజీ ముఖ్యమంత్రి, కుప్పం శాసనసభ్యులు, టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు అరెస్టును నిరసిస్తూ పట్టభద్రులు ఆదివారం నాడు కుప్పం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ విస్తరణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు ఆధ్వర్యంలో రోడ్డెక్కారు. కుప్పం పట్టణం చెరువు కట్టమీద నుండి బస్టాండ్ మీదగా బి సి ఎన్ కళ్యాణ మండపం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా బస్టాండ్ ప్రాంగణంలోని స్వతంత్ర సమర యోధులు సుభాష్ చంద్రబోస్, రాజ్యాంగ సృష్టికర్త డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలతో పాటు టిడిపి వ్యవస్థాపక అధ్యక్షులు రామారావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బి సి ఎన్ కళ్యాణ మండపం నందు ఏర్పాటుచేసిన సభా సమావేశంలో పలువురు పట్టభద్రులు మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ వల్ల యువతకు కలిగిన ప్రయోజనాలను వివరించారు. యువత భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అద్భుతమైన కార్యక్రమాన్ని చేపట్టిన తమ నాయకుడిని అధికార ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమానికి వ్చిన వారికి టిడిపి సమన్వయకర్త పిఎస్ మునిరత్నం, విస్తరణ కమిటీ అధ్యక్షులు డాక్టర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు ధన్యవాదాలు తెలిపారు.



స్వచ్ఛతాహి కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

జోరుగా స్వచ్ఛ తాహి సేవా

ప్రజాశక్తి -శాంతిపురం: పరమహంస యోగానంద విద్యాలయంలో ఘనంగా "స్వచ్ఛ తాకి సేవ" కార్యక్రమం నిర్వహించారు. పరమహంస యోగానంద విద్యాలయంలో(సి.బి. ఎస్.ఇ) కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు లిగాంధీ జయంతినిలి పురస్కరించుకుని చుట్టుపక్కల గ్రామాలైన లిసొన్నే గాని పల్లె మరియు కూతే గాని పల్లెలి గ్రామ సచివాలయం , గ్రామానికి చెందిన అంగన్ వాడి భవనం మరియు గ్రామ వాడలు మొదలైన అన్ని ప్రాంతాలలో లిస్వచ్ఛతా కి సేవలి కార్యక్రమంలో భాగంగా లిపరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఎంతో చక్కగా పాల్గొని అన్ని ప్రదేశాలను పరిశుభ్రం చేశారు. ఇందులో భాగంగా విద్యాలయ ప్రిన్సిపల్ ఆజాద్ హుస్సేన్‌లి , ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు లిషేక్ షమీమ్, ప్రతాప్ , వనిత రాణి, మంజు భార్గవి ,షారన్, గణేష్ సహాయ సిబ్బంది ఎంతో ఉత్సాహంగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేశారు.

నగరి : ప్రధాన మంత్రి స్వచ్ఛతా హి సేవ పిలుపులో భాగంగా ఆదివారం నగరి



వీధులనుశుభ్రం చేస్తున్నకమిషనర్ వెంకట్రామిరెడ్డి

మున్సిపల్ చైర్మన్ పీజీ నీలమేఘం, మున్సిపల్ కమిషనర్ వెంకట్రామిరెడ్డి రోడ్లు ఊడ్చి శ్రమదానం చేశారు. టవర్ క్లాక్ జంక్షన్ నుండి పుదుపేట వరకు వారు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బందితో కలిసి చీపురు పట్టి రోడ్లను శుభ్రపరచడం, రోడ్ల ప్రక్కన ఉన్న చెత్తను తొలగించడంతో పాటు ప్రతి ఒక్కరు వారున్న ప్రాంతాల్లో ఒక గంట పాటు శ్రమదానం చేయాలంటూ పట్టణ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిల్లర్లు గోపాల్ రెడ్డి, దయానిధి, ఇంద్రయ్య, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ జి.పురుషోత్తం, వార్డ్ పర్యావరణ, పారిశుద్ధ్య కార్యదర్శులు, పారిశుద్ధ్య మేస్త్రీలు తదితరులు పాల్గొన్నారు. స్థానిక పభ్రుత్వ డిగ్రీకళాశాల ఎన్‌సీసీ ఏఎన్ఓ లెఫ్టినెంట్ భాస్కర్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ కేడెట్స్ స్వచ్ఛత హిసేవ నిర్వహించారు. స్థానిక పీసీఎన్ పభ్రుత్వ ఉన్నత పాఠశాలలో గాంధీజీ విగ్రహాన్ని శుభంచ్రేసి, పాఠశాల పరిసరాలలో చెత్తచెదారాన్ని , కలుపు మొక్కలను ఏరివేసి శుభ్రం చేశారు. అనంతరం లెఫ్టినెంట్ మాట్లాడుతూ గాంధీజీ ఆశయాన్ని సాధించడంలో పభ్రుత్వం దృఢ సంకల్పాన్ని అర్థం చేసుకోవాలన్నారు. ఏడాది పాటు క్రమం తప్పకుండా తమ సమయాన్ని పరిశుభత్ర కోసం వెచ్చి స్తామని కేడెట్స్‌తో పత్రిజ్ఞచేయించారు. స్వచ్ఛత హిసేవలో భాగంగా ప్రెయివేటు పాఠశాల విద్యార్థులు మొక్కలతో పట్టణ పరిధిలో నిర్వహించిన ర్యాలీ అందరినీ ఆకర్షించింది. ప్రతి విద్యార్థికి ఇచ్చిన మొక్కను వారు ఇంటి వద్ద నాటి పెంచాలని, పరిశరాలను శుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు ఉపాధ్యాయులు సూచించారు.



సోమలలో శ్రమదానంచేస్తున్న నాయకులు

సోమల: సోమల మండలంలోని అన్ని పంచాయతీలలో ఆదివారం స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా శ్రమదాన కార్యక్రమాలను ఉదయం పదకొండు గంటల నుండి 11 గంటల వరకు నిర్వహించారు. పంచాయతీ కార్యాలయాల వద్ద ఆసుపత్రి ఆభరణాలు మసీదు దేవాలయ ప్రాంగణ ఆభరణాలు పాఠశాలల ప్రాంగణాలలో స్వచ్ఛందంగా శ్రమదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కందూరు పొదలకుంటపల్లి సోమల అన్నమ్మ గారి పల్లి 81 చిన్న ఉప్పరపల్లి పంచాయతీలలో సర్పంచులు, కార్యదర్శులు, వాలంటీర్లు, గ్రామస్తులు, శ్రమదాన కార్యక్రమాలలో పాల్గొని చెత్తాచెదారం తొలగించి, పిచ్చి మొక్కలు తొలగించి పరిసరాలను పరిశుభ్రం చేశారు.

పెద్దపంజాణి: ప్రజలందరూ స్వచ్ఛందంగా పరిశీలన శుభ్రంగా ఉంచుతూ శుభ్రత పాటించడం ప్రతి ఒక్కరు బాధ్యత అని కోగిలేరు సర్పంచ్ రమేష్ బాబు అన్నారు. ఆదివారం కోగిలేరు గ్రామపంచాయతీలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు స్వచ్ఛతాహి సేవ కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ రమేష్ బాబు ఆధ్వర్యంలో సచివాలయ సిబ్బంది, నాయకులు, ప్రజలు, వాలంటీర్ల సమన్వయంతో శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కోగిలేరులోని అంగన్వాడీ కేంద్రం, సచివాలయం, ప్రాథమికోన్నత పాఠశాల, రైతు భరోసా కేంద్రం పరిసరాలలో ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలు, గడ్డిని తొలగించి శుభ్రం చేశారు.

బంగారుపాళ్యం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుందామని తగవారిపల్లి సర్పంచ్ వాణి ప్రియ అన్నారు. ఆదివారం మండలంలోని తగువారిపల్లి పంచాయతీ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ ఎస్ ఎస్ స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాణి ప్రియ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం గాంధీ జయంతిని పురస్కరించుకుని స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని చేపట్టారని అని ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకొని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా తయారు కావాలన్నదే కేంద్ర ప్రభుత్వ ఉద్దేశమని దీనికోసం ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయం రహదారిలో పరిసరాలను శుభ్రం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్–ఎస్ వాలంటీర్ల ద్వారా కళాశాలను శుభ్రపరిచారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి దుర్గాప్రసాద్ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ మురళి పలువురు సచివాలయ సిబ్బంది పంచాయతీ పారిశుద్ధ కార్మికులు, గ్రామ వాలంటీర్లు ఎన్ఎస్ఎస్ వాలంటరీలు పాల్గొన్నారు.

యాదమరి: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లయితే ఆరోగ్యవంతంగా ఉండగలమని రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు స్వచ్ఛత కోసం అన్ని చర్యలు చేపట్టడం జరుగుతోందని చిత్తూరు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ బి. ధనుంజయ రెడ్డి అన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా యాదమర్రి మండల కేంద్రంలో ఏక్ గంట కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని అందుకు మొదట పరిసరాలను శుభ్రం చేసుకోవాలనిశుభ్రంగా ఉన్నట్లయితే ఆరోగ్యంబాగుంటుందని అంటూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ర్యాలీనిర్వహించారు. అనంతరం గ్రీన్ అంబాసిడర్ లకు సన్మానం చేశారు. కార్యక్రమంలో గ్రీన్ అంబాసిడర్లతో పాటు వాలంటీర్లు సచివాలయ ఉద్యోగులు భారీ ఎత్తున పాల్గొని గ్రామంలో పలు వీధులను పరిశుభ్రం చేశారు.

